**ఆకలి అమృతమూ, విషమూ రెండూ అవుతుంది. సాధారణంగా ఆకలికీ, ఐశ్వర్యానికి సంబంధ ముండదు. ఐశ్వర్యం, ఆకలికి అర్థం అనుభవ పాఠంనుంచీ నేర్చుకోవడం యెంత గొప్పగా వుంటుంది!**

## "పోస్ట్!"

పోస్ట్‌మాన్ కేక విని పూరింటిలోంచి పదహారేళ్ళ పద్మ పరిగెత్తుకుంటూ బయటకు వచ్చింది. పోస్ట్‌మాన్ ఒక కవరు ఇచ్చి వెళ్ళిపోయాడు.

"ఎవరికే పద్మా! ఆ ఉత్తరం? నీకేనా?" అంటూ లోపలనుండి కృష్ణ వచ్చాడు.

పద్మ కవరుమీద అడ్రసుచూసి నిరుత్సాహపడింది అది తనకుకాదు.

"ఇదుగో నీకేలే. ఎలాగైతేనేం వచ్చింది ఒక ఉత్తరం మా ఫ్రెండు రాసిందేమో అనుకున్నాను." అంటూ పద్మ ఉత్తరాన్ని కృష్ణ చేతిలో పెట్టి లోపలకు వెళ్ళింది.

కృష్ణ చెల్లెలి ఉడుకుమోతనానికి నవ్వుకుంటూ కవరు చించి చదివాడు. అది తన స్నేహితుడు కిషోర్‌బాబు వ్రాసిన ఉత్తరం. ఆదివారంనాడు పలకలూరు వస్తున్నట్టు వ్రాశాడు. కృష్ణ వెంటనే లోపలకు వెళ్ళి తల్లితో ఆ విషయం చెప్పాడు. సుభద్రమ్మ కూడా సంతోషించినా తన ఇంటికి రాబోయే ఆ ధనవంతుల అబ్బాయికి ఎలోటూ రాకుండా మర్యాదగా ఎలా చెయ్యాలా అనే ఆలోచనలో పడింది. కృష్ణ ఒక్కసారి తను, కిషోర్‌బాబు కలిసి చదువుకున్న రోజులు గుర్తుకు తెచ్చుకున్నాడు


తను కిషోర్‌బాబూ బియస్సీవరకూ పట్నంలో కలిసి చదివారు. కిషోర్‌బాబు తండ్రి పట్నంలోని లక్షాధికారుల్లో ఒకడు. శ్రీ మహేశ్వర టుబాకో కంపెనీ ఆయనదే ఇంకా నాలుగైదు ఇతర వ్యాపార సంస్థల్లో షేరుకూడా ఉన్నాయి. వ్యాపారంలో వచ్చే ఆదాయాన్ని ఎలా దాచుకోవాలి? అనే సమస్య తప్ప ఆయనకు మరే సమస్యా వున్నట్లు తోచదు డబ్బులో పుట్టిన కిషోర్‌బాబు కష్టమంటే యేమిటో తెలియకుండా పెరిగాడు కాలేజీకి కారులోనే వెళ్ళి వచ్చేవాడు బియస్సీ రెండవ సంవత్సరంలో తమ యిద్దరికీ స్నేహం కలిసింది. కారణమేమోగాని కిషోర్‌బాబు క్లాసులో తనతో మాత్రమే ఎంతో చనువుగా మనస్సు విప్పి మాట్లాడేవాడు. బియస్సీ ముగిసినా ఆ స్నేహం మాసిపోలేదు.

బియస్సీ ముగిసేనాటికి తన తండ్రి చనిపోవటంతో ఇంటి ఆర్థిక పరిస్థితి తారుమారయింది. అప్పటికే అప్పుల్లో వుండటంతో తను పై చదువు మానేసి తనకున్న ఐదెకరాల వ్యవసాయాన్ని చూసుకోవటం ప్రారంభించాడు. పద్మ కూడా ఎనిమిదవ తరగతితో చదువు మానేసింది. కిషోర్‌బాబు కూడా ఎమ్మెస్సీ ముగించి వ్యాపారంలోకి దిగాడు ఎన్నోసార్లు తనకు ఆర్థికంగా సాయపడటానికి ముందుకు వచ్చినా ఆ అయాచిత సహాయాన్ని తనెప్పుడూ స్వీకరించలేదు స్వయం కృషితోనే ఎలాగైతేనేం ఈనాటికి అప్పుల్ని తీర్చగలిగాడు. బహుశా తన స్వభావం అటువంటిది కావటంచేతనే కాబోలు తనంటే కిషోర్‌కు గౌరవమూ, అభిమానమూ. సంక్రాంతికి తమ వూరు వస్తున్నట్లు వ్రాశాడు ఒక్క సంవత్సరానికే వ్యాపారపు సమస్యలతో విసిగెత్తిపోయాననీ, ఈ సంక్రాంతికి పలకలూరు వచ్చి నాలుగు రోజు లుంటాననీ వ్రాశాడు.

ఆదివారం రానే వచ్చింది. సాయంకాలం అవుతుండగా తెల్లటి ఫియట్ కారొకటి వచ్చి యింటిముందు ఆగింది. కారు మోత విని కృష్ణ బయటకువచ్చాడు పద్మ తలుపుచాటున నిలబడి చూస్తోంది. కారులోంచి కిషోర్‌బాబు దిగాడు ఎర్రగా, ఎత్తుగా ఉన్నాడు. పట్నవాసపు సుకుమారత అంతా అతనిలో మూర్తీభవించి ఉంది. కృష్ణ నవ్వుతూ కిషోర్‌ను సమీపించాడు.

"అబ్బ! ఏం రోడ్డోయ్! ఒళ్ళంతా హూనం అయింది. తారురోడ్డునుంచి మళ్ళే సరికి ఒక పేగతుకులూ. దుమ్మూ." కూలింగ్ గ్లాసులు తీసి ఒళ్ళంతా దులుపుకుంటూ అన్నాడు కిషోర్‌బాబు.

పలకలూరుకు మూడు మైళ్ళ దూరంలో తారురోడ్డు వుంది. ఆ మూడు మైళ్లూ గతుకుల బాటే ...డు.





# ఆకలే ఐశ్వర్యమా?

పాపినేని శివశంకరరావు

"క్షమించండి దొరగారూ! మీరు వస్తు న్నారని కాస్త ముందు తెలిస్తే ఊళ్ళో దాకా తారురోడ్డే వేయించేవాడిని" అన్నాడు కృష్ణ హాస్యంగా.

"ఏడిశావులే. ముందు లోపలికి పద. ఇదేనా మీ ఇల్లు?" అంటూ కృష్ణ వెంట లోపలకు నడిచాడు కిషోర్‌బాబు చుట్టూ పరిశీలనగా చూస్తూ.

పూరిల్లే అయినా అతని కంటికి అందంగానే కనిపించింది. ఇంటి ముందు కొయ్య గేటు. అది దాటగానే ముందు వున్న కొంచెం ఆవరణలో బంతి చెట్లు విరబూసి వున్నాయి. కిషోర్ బాబు వసారాలోకి రాగానే సుభద్రమ్మ వచ్చి కాళ్ళకు నీళ్ళు పెట్టింది. కిషోర్‌బాబు నమస్కరించాడు. సుభద్రమ్మ చాలా సంతోషించింది. కలవారి పిల్లడైనా యెంత అణకువ! కుశల ప్రశ్నలు అయిన పిమ్మట కృష్ణ తన చెల్లెల్ని పిలిచి పరిచయం చేశాడు.

పద్మ సిగ్గుపడుతూ వచ్చి నమస్కరించి లోపలకు తుర్రుమంది- మెరుపుతీగలాగా. ఎర్రటి పూల పూల పరికిణీలో రెండు జడలతో కళకళలాడే ముఖంతో పద్మ అతనికెంతో అందంగా కనిపించింది. పల్లెటూళ్ళలో కూడా ఇంత అందం వుందా?

డ్రైవరు కార్లోనుంచి సూట్‌కేసు ఒకటి తెచ్చి ఇంట్లో పెట్టాడు. కిషోర్‌బాబు బూట్లు విప్పి కాళ్లు కడుక్కున్నాడు. వసారాలో ఒక ప్రక్కగా ఒక పాతకాలపు కుర్చీ. ఎదురుగా ఒక బల్ల, మధ్య ఒక స్టూలు ఉన్నాయి. స్టూలుమీద డిజైను గుడ్డ ఒకటి పరిచివుంది. కిషోర్‌బాబు వచ్చి కుర్చీలో కూర్చుంటే కృష్ణబల్లమీద కూర్చున్నాడు. పిచ్చాపాటీ మొదలయింది. బయట కారు చుట్టూ పిల్లలు మూగి దానినొక విచిత్ర జంతువులా చూస్తున్నారు. డ్రైవర్ వీరభద్రావతారం దాల్చి వారిని తరుము తున్నాడు. కాఫీ తాగిన పిమ్మట కిషోర్‌బాబు డ్రైవర్ని కారు తీసుకొని పట్నం వెళ్ళమని చెప్పి తిరిగి సంక్రాంతి మరుసటి రోజు రమ్మని చెప్పాడు.

కృష్ణ, కిషోర్‌బాబుకు తమ ఇంటి ఆవరణంతా చూపించాడు. రెండు నిట్టాళ్ళతో వేసిన పూరిల్లు. మధ్యలో తడికెలతో మూడు గదులుగా చేశారు. వంటా, వార్పు కోసం ఇంటి వెనక ఒక చిన్న పాక. ఇంటి ముందు అంతగా ఖాళీప్రదేశం లేకపోయినా యింటివెనక దొడ్డి విశాలంగా వుంది. కొట్టంలో ఒక గేదె, ఒక ఆవు వున్నాయి. కృష్ణ, కిషోర్‌బాబు అక్కడకు వెళ్ళేసరికి లేగదూడ పలుపు తప్పించుకొని తిరుగుతుంటే పద్మ దాన్ని పట్టుకోవటానికి వెంటబడి పరిగెత్తుతూంది. అది ఎంతకూ చిక్కటంలేదు. ఆ దృశ్యం చూస్తుంటే కిషోర్‌బాబుకు సరదాగా వుంది. వాళ్ళను చూడగానే పద్మ ఆగి రొప్పుతూ "అన్నాయ్! దూడను కాస్త పట్టుకోవూ?" అని అడిగింది.

"నేను పట్టుకోనా?" అన్నాడు కిషోర్ సరదాగా.

పద్మ సిగ్గుపడి మాట్లాడలేదు.


"మా దూడను పట్టుకోవటం నీవల్ల కాదులే. అయినా ప్రయత్నించు చూద్దాం" అన్నాడు కృష్ణ.

కిషోర్‌బాబు లేగదూడ వెంటబడ్డాడు. అది చిక్కకుండా కొట్టమంతా తిప్పింది. కిషోర్‌బాబు అలిసిపోయి తెల్లమొహం వేశాడు.

"ఇదేం కారులో షికారు చెయ్యటమనుకున్నావా ఏమిటి?" అని నవ్వుతూ కృష్ణ వెళ్ళి దూడను కట్టేసి వచ్చాడు.

రాత్రి సుభద్రమ్మ పెందరాళే భోజనాలు వడ్డించింది. పద్మ అవీ, ఇవీ అందిస్తూంది. విస్తట్లో వడ్డించిన గడ్డ పెరుగు చూసి కిషోర్‌బాబు ఆశ్చర్యపోయాడు. పెరుగు అంత గట్టిగా ఉండటం ఎలా సాధ్యం? ఆ పిల్లవాడి అమాయకత్వానికి సుభద్రమ్మ నవ్వుకుంది. భోజనాలు ముగిసిన పిమ్మట కృష్ణ, కిషోర్‌బాబు ఆరుబయట నులక మంచం వేసుకుని కూర్చున్నారు.

తను వచ్చి ఒక్కరోజుకూడా గడవక పోయినా కిషోర్‌బాబు ఆ యింట్లోని బీదతనాన్ని గమనించాడు. ఎన్నో సంవత్సరాలైనా పూరిల్లు తిరిగి కప్పించలేదు. వర్షం కురిస్తే యిల్లంతా తడిసేట్టుంది.



గుంటూరు జిల్లా పొన్నూరులోని శ్రీ సహస్ర లింగేశ్వరస్వామి ఆలయఆవరణలోగల ఆంజనేయస్వామి (ఎత్తు 24 అడుగులు, వెడల్పు 13 అడుగులు, మందము 4 అడుగులు), గరుడాళ్వార్ (ఎత్తు 27 అడుగులు. వెడల్పు 14 అడుగులు, మందము 3 అడుగులు) ఏకశిలా విగ్రహాలు.

ఫొటో : వి. ఆర్. ప్రసాద్‌రావు పొన్నూరు.

గోడలక్కడక్కడా పెచ్చులు లేచివున్నాయి. ఇంటివెనక పాకలో వంట. తడికెల స్నానాల దొడ్డి. పాతకాలపు మంచాలు,కుర్చీలు. తమ మేడలోమాదిరిగా ఇక్కడ డ్రాయింగు రూములు, బెడ్ రూములు అంటూ ఏమీ లేవు. ఆ ఇంట్లో అణువణువునా పేదరికం వ్యాపించిఉంది. ఎందుకనో ఆ పూరింటిలోని వ్యక్తుల నడుమ తనవంటి ఖరీదైన వ్యక్తి ఉనికి హాస్యాస్పదంగా అనిపిస్తూంది.


కృష్ణ, కిషోర్‌బాబు ఎంతోసేపు తమ కాలేజీరోజుల గురించి మాట్లాడుకున్నారు. చదువు మానేసినప్పటినుంచి వ్యవసాయంలో తను ఎటువంటి ఇబ్బందుల్ని ఎదుర్కొన్నదీ వివరించి చెప్పాడు కృష్ణ. ఒక వైపు తన చదువుకోసం చేసిన అప్పు. మరొకవైపు కొత్తగా ప్రారంభించిన వ్యవసాయం, దానిలోని సాధకబాధకాలను అర్థం చేసుకోవటంలోనే ఏడాది గడిచిపోయింది. మొదటి సంవత్సరం ఏమీ మిగలలేదు. రానురాను కాస్త పుంజుకొని ఈ నాటికి స్థిరపడ్డాడు తను. అప్పుతీరింది. ఇక చెల్లెలి వివాహమే ప్రస్తుతం తనకున్న సమస్య. ఆ మాటలు విన్న కిషోర్‌బాబు తనకు వ్యవసాయం గురించి, పల్లెటూళ్ళ జీవన విధానం గురించి తెలుసుకోవాలని ఉన్నట్టు చెప్పాడు. అందుకు సమాధానంగా కృష్ణ :

"ఏదో నాలుగైదు రోజులుండి పోయే వాడికి ఇక్కడి పరిస్థితులెట్లా అర్థమవుతాయి కిషోర్? పైగా మీవంటి ధనవంతులకూ, పల్లెటూళ్ళకూ చుక్కెదురు. ఇక్కడ మీరు బ్రతకలేరు. మీరు పుస్తకాల్లో మాత్రమే చదువుతారు పల్లెలగురించి. వాటిల్లో యిక్కడ అందమైన ప్రకృతి శోభ వుంటుందనీ కల్లాకపట మెరగని మనుషులుంటారనీ వ్రాస్తారు. మీకు కనిపించే పల్లెటూళ్ళ "గ్లామర్" అది. ఆ గ్లామర్ వెనక, యిక్కడి అందమైన ప్రకృతివెనక ఈ పల్లెవాసుల కష్టాలూ, కన్నీళ్ళూ దాగివున్నాయి. అవి మీ కళ్ళకూ, మనస్సుకూ అందవు. ఇక్కడ ఆరుగాలం ఎండవానల కోర్చి కష్టపడే కూలీలకు కడుపు నిండదు. చెమటోడ్చి పండించే రైతుకు ప్రకృతి అనుకూలించదు. పండిన పంటకు సరైన ధర రాదు. మధ్యలో దళారులూ, వ్యాపారస్థులూ బాగుపడతారు. మరి రైతుకు మిగిలేది ఇక్కడిమట్టి, దుమ్మూమాత్రమే. ఈ శ్రమశక్తి దోపిడీకి అంతెక్కడుంది? పల్లెటూళ్ళలో సామాన్యరైతు అప్పుల్లోపుట్టి, అప్పుల్లో పెరిగి, అప్పుల్లోనేచస్తాడు. నీకు తెలియదేమో నీ ముప్పూటల తిండికీ, విలాస జీవితానికీ యెవడు రేయింబవళ్ళు శ్రమిస్తున్నాడో వాడు చరిత్రహీనుడు."

కిషోర్‌బాబు కాసేపటి వరకు ఏమీ మాట్లాడలేదు. కృష్ణ మాటల తీవ్రత వెనకగల ఋజు స్వభావాన్ని అతడు గ్రహించాడు. కొంత సమయం గడిచాక

"నువ్వు చెప్పింది నిజమే కావచ్చు. అయినంత మాత్రాన ఒక ధనవంతుడు పేదవాళ్ళ జీవితాన్ని గురించి తెలుసుకోవాలనుకుంటే తప్పేముంది ?" అన్నాడు.

"తప్పులేదుగానీ దానిని గూర్చి నువ్వు తెలుసుకోవటమే కష్టం. నీకు తెలుసో, లేదో నీ కారుకు పెట్టిన డబ్బుతో ఒక నిరుపేద జీవితాంతం సుఖంగా బతకగలడు. అయినా ఒక్కరోజు నీ ఖరీదైన దుస్తుల్ని



వదిలి పొలంలో పని చెయ్యి. అప్పుడు తెలుస్తుంది కష్టజీవుల బతుకంటే ఏమిటో" అన్నాడు కృష్ణ చిరునవ్వుతో.

"తప్పకుండా చేస్తాను. ఈసారి నువ్వు పొలం వెళితే నన్నూ తీసుకెళ్ళు" అన్నాడు కిషోర్ పంతంగా.

"తప్పకుండా తీసుకెళతాను. మరి నాతో పాటు పనిచెయ్యాలి సరేనా?" అడిగాడు కృష్ణ.

కిషోర్‌బాబు అంగీకరించాడు. ఇక సంభాషణ వాళ్ళిద్దరి పెళ్ళివిషయం వైపు మళ్ళింది. మాటల్లో చాలాసేపు గడిచిపోయింది. కృష్ణపక్షపు రాత్రి. ఆకాశంలో చుక్కల మిలమిల. చల్లటి గాలి. పల్లె నిద్రపోతూ వుంది. ఎక్కడో ఒకమూల కుక్కల అరుపు. ఆ నిశ్శబ్దపు రాత్రి ఆ చుక్కల ఆకాశం క్రింద కృష్ణతో మాట్లాడుతుంటే ఏదో నూతన లోకానికి వచ్చినట్టు అనిపించింది కిషోర్‌బాబుకు. ఇద్దరూ వెళ్ళి పడుకున్నారు.

కిషోర్‌బాబుకు వేకువ జామున మెలకువ వచ్చింది. విపరీతమైన చలి వలన నిద్ర పట్టలేదు. పరుపులేని నులక మంచం ఒత్తుకుపోతూంది. లేచి బయటకువచ్చాడు. ఊరంతా మేలిముసుగు కప్పుకున్నట్టు తెల్లని మంచుతెర. వీధుల్లో నీళ్ళకావిళ్ళ మోతలు. అడపా దడపా ఎద్దుబళ్ళ కిర కిరలు. ముంగిట్లో పద్మ పరికిణీ పైకెగదోపి సంక్రాంతి ముగ్గువేస్తూ ఉంది. ఎంత పెద్దముగ్గు! ఎన్ని మెలికలు! కిషోర్‌బాబు ఆశ్చర్యంతో అడిగాడు.

"ఇంత పెద్ద డిజైను ఎలా నేర్చుకున్నావు? చాలా బాగుంది."

పద్మ తలెత్తి చూసి అతని అమాయకత్వానికి కిలకిలా నవ్వింది.

"ఇది డిజైను కాదు ముగ్గు" అంటూ లోపలికి పరిగెత్తింది.

అంత చలిలోలేచి వీళ్ళెలా పనిపాటులు చేసుకుంటున్నారాఅని విస్తుపోయాడు కిషోర్‌బాబు. తెలతెల వారుతూంది. చీకటి కడుపున పుదయిస్తున్న ఎర్రటి సూర్యబింబం. ఒక్కొక్క వెలుగు రేఖ మెల్లగా వచ్చి ప్రకృతిని కౌగిలించుకుంటూంది. కిషోర్‌బాబు అలాగే చూస్తుండిపోయాడు. పట్టణంలో తనెప్పుడూ సూర్యోదయాన్ని చూసి ఎరగడు. అక్కడ గడియారానికి తప్ప సూర్యోదయ సూర్యాస్తమయాలకు విలువ లేదు.

కృష్ణ ఉదయమే పొలంవెళ్ళిమధ్యాహ్నానికి తిరిగి వచ్చాడు భోజనానికి. కిషోర్ అడిగాడు ఎక్కడకు వెళ్ళావని.

"కళ్ళం బాగుచేయడానికి వెళ్ళాను.

KANTA CHAP

రంజాన్ పండుగ సందర్భంలో మీ కుటుంబానికి కావలసిన అన్ని రకముల వస్త్రములు, పోలిస్టర్ సూటింగ్స్, షర్టింగ్స్, శారీస్, డ్రస్ ప్రాక్రిక్సులు సరికొత్త డిజైన్లకు "బోంబే డైయింగ్ శ్రీలక్ష్మి' షోరూంకు దయచేయండి.

బోంబే డైయింగ్ షోరూం

'శ్రీ లక్ష్మి', కొత్తగూడెం.



మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్సా
విరేచనముతో
చికిత్సను పొందండి
—శస్త్రచికిత్స
అవసరములేదు!

ప్రఖ్యాతి చెందిన!
ఖటావ్ మిల్లు వారి
★ 100% పాలియస్టర్ చీరలు.
★ ఫుల్‌వాయిల్, హాఫ్ వాయిల్ చీరలు
★ షర్టింగులు, గ్లాసుకో ధోవతులు
★ డ్రస్ మెటీరియల్సు, 2×2 రుబియాలాన్సు
★ స్కూలు యూనిఫారంలు... వగైరాలకు
విజయ షోరూమ్
ప్రత్యేక ఖటావ్ మిల్లు వస్త్రముల షోరూమ్
J.D. హాస్పటల్ రోడ్డు
గవర్నరుపేట విజయవాడ-2.

డా॥ పి. వి. కె. రావ్, B. A.,
వైద్యవిద్వాన్, వైద్యాచార్య, సెక్స్ స్పెషలిస్ట్

వివాహము వాయిదా వేయనవసరంలేదు. హస్తప్రయోగం, నరముల బలహీనత, శీఘ్రస్కలనములకు ఆయుర్వేద చికిత్స పోస్టు ద్వారా చికిత్స లదు.
రావూస్ క్లినిక్
టి. వి. రోడ్, తెనాలి, ఫోన్ : 700. 1010.
SUVARNA

రేపు నూర్పిళ్ళు" అన్నాడు కృష్ణ.

అంటే ఏమిటో కిషోర్‌బాబుకు అర్థం కాలేదు.

"అయ్యా దొరగారూ! వడ్లు మీ పట్టణంలో ఫ్యాక్టరీల్లో పండుతున్నాయనుకుంటున్నావా ఏమిటి? దానికెంతో తతంగం వుంది."

"అయితే నేనూ వచ్చేవాడినిగా, రాత్రి మాటలు మర్చిపోయావా?"

"లేదులే. రేపు పుదయాన్నే తీసుకు వెళతాను. నేను చేసే పనంతా నువ్వూ చెయ్యాలి."

"నువ్వే చూస్తావుగా."

ఈ మాటలు వింటున్న సుభద్రమ్మ కల్పించుకుంది

"అదేమిట్రా? ఆ అబ్బాయేదో నాలుగురోజులు సరదాగా ఉండిపోదామని వస్తే పొలం పని చేయిస్తానంటావేమిటి? వాడి మాటలకేంగాని నువ్వు మాత్రం వెళ్ళకు నాయనా!"

"లేదు మామ్మగారూ! నేను కూడా పొలం పని గురించి తెలుసుకోవాలనుకుంటున్నాను" అన్నాడు కిషోర్‌బాబు.

"ఇంత మాత్రానికే మన అతిథి దేవుడు అరిగిపోడు లేమ్మా!" అన్నాడు కృష్ణ నవ్వుతూ.

సాయంకాల మవుతుండగా ఇద్దరూ షికారుకు బయలుదేరారు. కృష్ణ, కిషోర్‌కు తమ ఊరు నాలుగు బజార్లూ తిప్పి చూపించాడు. చిన్న ఊరే. ఇక్కడో ఇలు. అక్కడో ఇల్లు. పూరిళ్ళు. పెంకుటిళ్ళు తప్ప కిషోర్‌కు యెక్కడా ఒక్క మేడకూడా కనిపించలేదు. ఊరు దాటి యిద్దరూ కాలవ గట్టువైపు నడక సాగించారు. కోతలు. నూర్పిళ్ళు ముగిసి కొన్ని పొలాల్లో గడ్డివాములు కనిపిస్తున్నాయి. ఆ యేడు పైర్లు కోతకు వచ్చే సమయానికి వర్షాలవల్ల ఎంతనష్టం కలిగిందో కృష్ణ చెప్పాడు. ఇద్దరూ కాలవ వంతెనమీద కూర్చున్నారు. మాటలమధ్య కిషోర్‌బాబు తను వ్యాపారంలోకి దిగి సంవత్సరమే అయినా ఆ తిరుగుడు. మరుగుళ్ళతో ఇప్పటికే ఎంత విసిగిపోయాడో చెప్పాడు. తన తండ్రి మాదిరిగా వ్యాపార వ్యవహారాల్లో సరిగ ఇమడలేకపోయానని. కాస్త ప్రశాంతి కోసం ఇలా వచ్చాననీ అన్నాడు. ఆ సమయంలో కృష్ణకు అనిపించింది. లేనివాడి బాధ లేనివాడిదైతే వున్నవాడి సమస్యలు వున్నవాడివని. వున్నట్టుండి కిషోర్‌బాబు దూరంగా కాలవ ఒడ్డున కనిపించే ఒక చెట్టువైపు చూపించి అదేమిటని అడిగాడు. కృష్ణకు నవ్వాగలేదు. అది ఈతచెట్టు.

చీకటి పడుతుండగా ఇద్దరూ లేచి ఇంటికి మళ్ళారు. దారిలో కిషోర్ కాల్లో ముల్లు గుచ్చుకుంది. ప్రాణం మింటబోయింది. బాధతో కళ్ళవెంట గిర్రున నీళ్ళు తిరిగాయి. కృష్ణ జాగ్రత్తగా ముల్లు లాగేశాడు.

"పల్లెటూరి బతుకు యింతకంటె యెన్నోరెట్లు బాధగా వుంటుంది" అన్నాడు కృష్ణ.

ఆ రాత్రి కాలినొప్పితో కిషోర్‌కు సరిగా నిద్రపట్టలేదు. రాత్రి నడిజామున కృష్ణ కిషోర్‌ను నిద్రలేపాడు.

"లేలే పొలం వస్తానంటివిగా. ఇవాళే నూర్పిళ్ళు. వెళదాం పద."

కిషోర్ ఆశ్చర్యంతో వాచీ వంక చూశాడు. రెండు గంటల సమయం. ఇప్పుడు నూర్పిళ్ళేమిటి?

"అర్ధరాత్రి మదెల దరువని ఇప్పుడా పొలం వెళ్ళటం? తెల్లవారిన తర్వాత వెళదాంలే," అన్నాడు కిషోర్‌బాబు ఆవలిస్తూ.

"తెల్లవారిన తర్వాతనా? ఇక నూర్పిళ్ళయినట్టే. ఇప్పటికే ఆలస్యం అయింది. చేను చాలా దూరం. బళ్లు కూడా వచ్చాయి. పోనీ నువ్వు రాలేకపోతే పడుకో. నేను వెళతాను" అన్నాడు కృష.

వెంటనే కిషోర్‌బాబుకు తన పంతం గుర్తుకు వచ్చింది. పట్టుదలతో లేచాడు. కళ్ళు నిద్రతో మూతలు పడుతున్నా కృష్ణతో బయలుదేరాడు. వాకిట్లో కూలికి మాట్లాడిన ఎడ్లబళ్ళు మూడు సిద్ధంగా వున్నాయి. ఒక బండిమీద పిడివాటు బల్లి, గోతాలు, చేటలు, పొలికట్టె వున్నాయి. బళ్ళతోపాటుఎనిమిదిమందికూలీలున్నారు. బళ్ళు డొంకదారిని దక్షిణపు పొలానికి బయలుదేరాయి. ఒక బండి తొట్టిలో కూర్చున్నాడు. కిషోర్‌బాబు కునికిపాట్లు పడుతూ. ఎద్దులు తోక విదిల్చినపుడల్లా ఒంటిమీద పేడ చిందరలు పడుతూ చిరాగ్గా వుంది.

ఊరినుండి మైలుదూరం వచ్చాక మురుగు కాలవ దాటి బళ్లు పొలంలో ఆగాయి. ఎకరన్నర పొలం కళ్ళంపక్కనే వరికుప్పలు. బళ్లుదించి పిడివాటుబల్లను కళ్ళంపక్కనే వేశారు. పనిమొదలయింది. ఒక కూలీ కుప్పఎక్కి వరికట్లు కింద పడేస్తున్నాడు. వాటిని విప్పి పిడికట్లు

అందిస్తుంటే నలుగురు కూలీలు పిడివాటు గొడుతున్నారు. ఇంకా ఇదరు కూలీలు చెత్త దులిపి కళ్ళంలో వేస్తున్నారు. కృష్ణ కూడా పిడివాటు గొడుతుంటే కిషోర్‌బాబు చిత్రంగా చూస్తూ నిలబడ్డాడు.

ఒకవైపు కళ్ళంలో బంతిగట్టారు. ఒక కూలీ ఎద్దుల సిగమోరల్ని కలిపి కట్టేసి దాపలి గిత్త సిగమోరకు పగం కట్టి పట్టుకొని వలసట గిత్తల్ని అదిలిస్తూ కళ్ళంలో తిప్పుతున్నాడు. ఆ ఎద్దుల్ని యెందుకలా తిప్పుతున్నారో కిషోర్‌బాబుకు అర్థం కాలేదు. కృష్ణను అడిగితే అటా బంతి తోలటంవల్లన కళ్ళంలో చెత్తనలిగి దానో మిగిలిన గింజలు రాలతాయని చెప్పాడు. ఆ మసక వెలుతుర్లో మరబొమ్మల్లా పని చేస్తున్న కూలీల్ని చూస్తుంటే కిషోర్‌బాబుకు ఆశ్చర్యంగా, వుత్సాహంగా వుంది.

"నేనుకూడా రానా?" అని అడిగాడు.

"నిరభ్యంతరంగా రావచ్చు." అన్నాడు కృష్ణ.

కిషోర్ లుంగీ బిగించి పనిలో జొరబడ్డాడు. ఒక పిడికట్ట తీసుకొని పిడివాటు బల్లమీద బాదసాగాడు. మొదట మొదట ఉత్సాహంగానే ఉంది. కానీ నాలుగైదు పిడికట్టలయ్యేసరికి చేతులు నొప్పిపెట్టసాగాయి. వడ్లు రాలటంలేదు.

"అంత సుతారంగా కొడితే వడ్లెలా రాలతాయి? నువ్వు పక్కన పడేసే చెత్తలో సగం వడ్లు అలాగే వున్నాయి." అన్నాడు కృష్ణ-కిషోర్‌బాబు నుడికిస్తూ.

కిషోర్‌బాబు ఈసారి పట్టుదలగా కొట్టటం మొదలెట్టాడు. అయితే ఆ బింకం ఎంతోసేపు నిలవలేదు. పది నిముషాల కల్లా రొప్పు వచ్చింది. చేతుల నొప్పి అధికమైంది. ఆయాసపడుతూ కూర్చున్నాడు. కృష్ణ, మిగిలిన కూలీలు ఆగకుండా పనిచేస్తూనే వున్నారు. వీళ్ళు మనుషులా రాక్షసులా అనిపించింది కిషోర్‌కు. కృష్ణ స్నేహితుని అవస్థ చూసి నవ్వుతూ అన్నాడు:

"కాసేపు విశ్రాంతి తీసుకుంటావా మిత్రమా? అయినా ఎందుకొచ్చినరొస్టు? కదలకుండా చూస్తూ కూర్చోరాదూ?"

కిషోర్‌కు రోషం పొడుచుకు వచ్చింది. తన యీడువాడు, తన క్లాసుమేటు ఆగకుండా పని చేస్తుంటే తను చెయ్యలేకపోవటమేమిటి? కిషోర్ దిగ్గున లేచి ఒక పిడికట్ట తీసుకొని బలంగా బల్లమీద బాదసాగాడు. దెబ్బ దెబ్బకు బుస్తైడు గింజలు రాలసాగాయి. కొన్ని యెగిరివచ్చి ముఖానికి తగులుతున్నాయి. అయిదు నిముషాలు ...పది నిముషాలు .... అరగంట.... కాలం గడిచిపోతూ వుంది. కిషోర్ ఆగలేదు. అంత చలిలోనూ అతనికి శరీరమంతా చెమట ధారాపాతంగా కారుతూంది. చేతులనొప్పి ఏమయ్యిందో? ఆయాసం ఏమయిందో? కృష్ణ ఆశ్చర్యంతో చూస్తూండిపోయాడు.

చలి ఎక్కువైంది. కూలీలు పని ఆపి చలిమంటవేసి కబుర్లాడుకుంటూ చలి కాచుకుంటున్నారు. కిషోర్‌బాబు కాసేపు చలిమంటవద్ద కూర్చుని తిరిగి కూలీలతోపాటు లేచాడు. కళ్ల తిరిగా[illegible]. చేతులు, కాళ్లు స్వాధీనంలోకి రాలేదు. అయినా తమా




ఇంద్రగంటి జానకీబాల రచనలు
ప్రేమలేఖ ....9.00
వెన్నెలమెట్లు ....9.00
యామిని రచనలు
పొద్దుతిరుగుడు పువ్వు ....9.00
పూర్ణిమ ....12.00
జి.వి. పూర్ణచందు రచన
అమలిన శృంగారం ....15.00
సి. విమలాగణేశ్ రచన
గృహిణి గుమ్మం దాటితే ....10.00
ఎమ్. లలిత కుమారి రచన
ప్రమద ....12.00
బి. అనంతరావు
సంఖ్యావాచక పదకోశము ....75.00

తెలుగుసాహిత్య వినీలాకాశంపై వెలుగురేఖల్ని క్రమక్రమంగా ప్రసరింపజేస్తున్న నూతన ప్రచురణా సంస్థ.

యార్లగడ్డ సరోజినీదేవి రచనలు
ఉషోదయం ....10.00
ఎండమావి ....10.00
ధర్మవరపు బుచ్చిపాపరాజు రచనలు
ఆంధ్రప్రదేశ్ దర్శిని (విహార యాత్ర) 12.00
భావిపౌరులు భారతదర్శిని (కేంద్రాలు) 12.00
బి. గోవిందమ్మ రచన
మంచుతెరలు ....10.00
ఎమ్.ఎస్. సౌజన్య రచన
నమ్మలేని నిజాలు ....10.00
కె. విజయలక్ష్మి రచన
డాక్టర్ మహర్షి ....10.00
మీరు కోరే పుస్తకం ధరలో ఒక రూపాయి తగ్గించి పంపండి. రూపాయికి వి.పి పంపుతాము.

ఫోన్: 63322
శ్రీ మహాలక్ష్మి బుక్ ఎంటర్‌ప్రైజెస్
మ్యూజియం రోడ్ విజయవాడ-520002
SOUND ADVT

## తారల ఫోటోలు

ఎన్. టి. ఆర్., కృష్ణ, శోభన్ బాబు, కృష్ణం రాజు, చిరంజీవి, మోహన్ బాబు, కమల్ హాసన్, శ్రీదేవి, సుజాత, జయసుధ, జయప్రద, జయమాలిని, మాధవి, దీప, ప్రభ, వీరందరి కార్డు సైజు ఫోటోలు మా వద్ద కలవు. కావల్సినవారు ఫోటోకి రు. 3-/ ఈ క్రింది అడ్రసుకు ఎం. ఓ. చేయండి. ఎం. ఓ కూపనులో ఎవరి ఫోటో కావాలో రాయడం మరువకండి.

వై. కె. మూర్తి,
దాసరివారి వీధి, విజయవాడ-2.

అత్యున్నతమైన
**ట్యాంగో®**
ఇంటర్నేషనల్
బ్రీఫ్స్ అండ్ బనియన్స్



నెటెడ్, రిబ్, ఇజిప్షన్, ఇంటర్‌లాక్
పంపిణీదారులు:
లాల్వాని బ్రదర్స్
సిద్దియంబర్ బజార్, హైదరాబాద్-12

**దీర్ఘవ్యాధులకు ఉత్తమ వైద్యం!**



దురభ్యాసములకులోనై దాంపత్యసౌఖ్యంపొంద లేనివారు,హెర్నియా, చర్మవ్యాధులకు పోస్టు ద్వారావరిబీజము(బుడ్డ), మూత్రవ్యాధులు, ఇస్నోఫిలియా, దమ్ము, ఉబ్బసమునకు ఆపరేషన్‌లేకుండ రండి.
డా|| దేవర,
5/1,బ్రాడీపేట, గుంటూరు-2
బ్రాంచీలు: 26,నార్త్‌బోగ్‌రోడ్,మద్రాసు-17. మార్వాడిగుడివద్ద,తెనాలి, ఫోన్ 551.

ఉచితము! ఉచితము!

## తెల్ల మచ్చలు

అన్నిరకాల మచ్చలను, ఎంపు రంగును మా ప్రఖ్యాత మందు అయిదు రోజులలో మార్చును. త్వరలోనే చర్మం మామూలు రంగు పొందును. ప్రచారం నిమిత్తం ఒక సీసా మందు ఉచితంగా పంప బడును. వెంటనే వ్రాయండి.

Krishna Chandra Vaidava (AJ)
P o Katri Sarai (GAYA) INDI


యించుకొని కృష్ణ వారిస్తున్నా వినక మళ్ళీ పనికి వంగాడు ఇందాకటి ఆవేశం ఇప్పుడు లేదు. చేతులు బొబ్బలెత్తి చచ్చుబడి పోయాయి. చెయ్యి కదల్చటానికికూడా ఓపిక లేకపోయింది. గుండె వేగంగా కొట్టు కుంటూంది. ఎగశ్వాస, దిగశ్వాసఅయింది. రాత్రి తిన్న తిండి ఎప్పుడో అరిగి పోయింది. పది నిమిషాలు గడిచేసరికి ఓపికంతా హరించుకుపోయింది. భరించ లేని నీరసంతో వున్నచోటనే కూలబడ్డాడు. కృష్ణ దగ్గరకు వచ్చాడు.

"ఏమిట్రా? ఏమయింది? నీరసంగా వుందా?" అని అడిగాడు.

కిషోర్ బాబు మాట్లాడే స్థితిలో లేడు. కళ్ళు తిరుగుతున్నాయి. శరీరం ఏమిటోగా వుంది. తెలివి తప్పుతుందేమో అనిపించింది. కడుపులో కరకర మంటూంది. ఒళ్ళు తాకి చూసుకున్నాడు. జ్వరం వచ్చినట్టు వెచ్చగా తగిలింది. కిషోర్ గొంతు పెగల్చుకొని మెల్లగా అన్నాడు:

"కృష్ణా! నాకు కళ్ళు తిరుగుతున్నాయి. ఒళ్ళంతా అదోరకంగా వుంది. జ్వరం వచ్చినట్టుంది, మాటాడలేకపోతున్నాను. ఊపిరి ఆడటంలేదు. నన్ను డాక్టరు వద్దకు తీసుకెళ్ళు. మీ ఊళ్ళో మంచి డక్టరు ఉన్నాడా?"

కృష్ణ ఆదుర్దాగా. కిషోర్ చెయ్యి పట్టుకొని చూశాడు. జ్వరం ఉన్నట్టు అనిపించ లేదు.

"మరేం భయం లేదులే. కాసేపు రెస్టు తీసుకో. అదే తగ్గిపోతుంది." అన్నాడు.

కిషోర్ ఏమీ మాటాడలేక కళ్ళు మూసుకుని ఉండిపోయాడు. చుట్టూ మూగిన కూలీలు లేచి వెళ్ళారు. కిషోర్ బాబు ఆందోళన తగ్గలేదు. ఈ పల్లెటూళ్ళో మంచి డాకరు కూడా వుండివుండడు. అదే పట్నంలో అయితే ఈపాటికి డాడీ, మమ్మీ ఎంతమంది డాక్టర్ను పిలిపించి వుండే వాళ్ళు? కనీసం బెడ్ కాఫీ అయినా దొరికేట్టులేదు ఇక్కడ. ఏం చెయ్యాలి? తను మళ్ళీ పట్నం చేరగలడా?

కరకరా పొద్దు పొడుస్తుండగా ఒక కూలీ ఊళ్ళోకి వెళ్ళి ఒక పెద్ద జల్లలో అన్నం. కూరలు పట్టుకొచ్చాడు. కృష్ణ బలవంతం మీద లేచి కిషోర్ పందుంపుల్లతో మొహం కడుక్కున్నాడు. ఆ గడ్డిలో విస్తరి ముందు కూర్చోగానే కడుపులో జఠరాగ్ని విజృంభించింది. కృష్ణ వడ్డిస్తుంటే ఇద్దరు కూలీలు తినే అన్నాన్ని అవలీలగా తినేశాడు. జన్మలో ఇంత అన్నాన్ని ఏనాడూ తిని ఎరగడు. పైగా మామూలు కూరలు,

పచ్చళ్ళే అయినా ఎంత కమ్మగా ఉన్నాయి! తను రోజూ తినే ఖరీదైన భోజనం దీనిముందు బలాదూరే అనిపించింది.

పొద్దెక్కుతుండగా పద్మ వచ్చింది చేనుకి. కృష్ణ చెల్లెల్ని చూసి కోప్పడ్డాడు.

"ఇంతదూరం నడిచి రాకపోతే ఏమయింది? ఇంటి దగ్గర పనేమీ లేదా ఏమిటి?"

"ఊరికే చూద్దామని వచ్చాను. ఈ ఏడు వడ్లు ఎన్ని అవుతాయన్నాయ్?" అడిగింది పద్మ.

"ఎన్నికాకేం? అదుగో ఈయేడు కిషోర్ కుప్పలు నూర్చేసరికి బాగా రాలినట్టున్నాయి. నలభై దాకా కావచ్చు సరే గాని నువ్వు పరిగెత్తుకుంటూ వెళ్ళి ఆచారి గార్ని పిలుచుకురా. ఈయనగారు కాస్త పాటుపడేపాటికి జ్వరం వచ్చిందట ఆపసోపాలు పడుతున్నాడు" అన్నాడు కృష్ణ నవ్వుతూ.

పద్మ కిషోర్ వంక చూసింది వింతగా. ఈసారి సిగ్గుపడటం కిషోర్ వంతు అయింది. తల దించుకొని బొబ్బలెత్తిన చేతుల వంక చూస్తూ కూర్చున్నాడు. తలంతా రేగి నూగు కొట్టుకొని వుంది. మొహం వాడిపోయింది. అతనికిప్పుడు కళ్ళు తిరగడం లేదు. నీరసం పోయింది. జ్వరం తగ్గినట్టుంది అనుకున్నాడు. ఒళ్ళు తాకి చూసుకొని.

పద్మ కాసేపుండి ఇంటికి బయలుదేరింది. పరికిణీ కొంచెం పైకెత్తి పట్టుకొని వరిమోళ్ళు తగలకుండా చెంగు చెంగున వెళుతున్న పద్మవంక చూస్తుంటె కిషోర్ బాబుకు కొట్టంలో గంతులు వేసే లేగదూడ గుర్తుకు వచ్చింది. చూస్తుండగానే కళ్ళు మూతలుపడసాగాయి. మరు నిముషంలో ఒక గడ్డిమోపుకు ఆనుకొని గురకపెడుతూ గాఢనిద్ర పోయాడు.

పొద్దు బారెడెక్కింది. బంతి తోలటం ఎప్పుడో ముగిసింది. కళ్ళంలో వడ్లన్నీ పొలికట్టెతో ప్రక్కకు ఊడ్చాడు కృష్ణ. వరిచెత్తంతా కడెం వేశారు. మధ్యాహ్నానికి గాని గాలి సాగలేదు. వడ్లు తూరుపెత్తటమయింది. ధాన్యం బస్తాలకు నింపి బళ్ళకెత్తారు. ఆ మధ్యాహ్నపు ఎండ కూడా కిషోర్‌కు నిద్రాభంగం కలిగించలేకపోయింది. కృష్ణ కిషోర్‌ను నిద్రలేపాడు. కళ్ళు నులుముకొని పొద్దు కేసి చూసి కిషోర్ ఆశ్చర్యపోయాడు. పట్టపగలు అంతసేపు ఆ యెండలో ఎలా నిద్రపోగలిగాడు తను? తమ యింట్లో యు-ఫోమ్ బెడ్ మీద కూడా యింత గాఢంగా నిద్రపోలే దెప్పుడూ.

"గంటసేపు పనిచేశారో లేదో యింత సేపు నిద్రా? కూలీలందరూ నీలాంటివాళ్ళే అయితే ఇంటికి గింజ చేరదు. ఇప్పటికైనా తెలిసిందా కాయకష్టమంటేఏమిటో? పదపద. పొద్దు వాటారుతూంది" అన్నాడు కృష్ణ కిషోర్‌ను ఎగతాళి చేస్తూ.

కిషోర్‌బాబు నవ్వాడు. పైకి లేవబోయేసరికి కాళ్ళు, చేతులు స్వాధీనం కాలేదు. ఒళ్ళంతా ఒకటే సలుపు. కృష్ణ చేయి ఊతనిచ్చి లేవదీశాడు. బళ్ళు మురుగు కాలవ చేరేసరికి వెనకబండి బురదలో దిగబడింది. దాపటెద్దు అంకేసింది. కూలీలు చక్రం వేసి బండిని కాలవదాటించే పాటికి చాలా సమయమయింది. వీళ్ళ శరీరంలో ఇంకా శక్తి ఎక్కడ వుందో అని కిషోర్ ఆశ్చర్యపోయాడు. శ్రమశక్తి అంటే ఏమిటో, దాని విలువ ఎంతటిదో అతనికి అవగతమయింది.

ప్రొద్దు ఎర్రలు దోలుతుండగా బళ్ళు ఇలు చేరాయి. బస్తాలు దించి ధాన్యం పురిగట్టేసరికి చీకటిపడింది. ఇద్దరూ స్నానాలు ముగించగానే సుభద్రమ్మ భోజనాలు వడ్డించింది. కిషోర్‌బాబు చేతులు బొబ్బలెక్కి ఉండటంతో తినటానికి కష్టపడుతుంటే సుభద్రమ్మ నొచ్చుకొని కొడుకును కోప్పడింది. ధనవంతుల అబ్బాయిని అంత కష్టపెట్టటం ఏమంత భావ్యం?

భోజనం చేసినంత సేపూ కృష్ణ కుప్పలు నూర్చేటప్పుడు కిషోర్ పడిన అవస్థలన్నిటినీ వర్ణించి చెప్పాడు- పడిపడి నవ్వుతూ. కిషోర్‌బాబు కూడా శ్రుతి కలపకుండా ఉండలేకపోయాడు. పద్మ తలుపు పక్కనే నిలబడి నవ్వుతూ వింటూ వుంది. మాటల మధ్యలో కిషోర్ ఉండబట్టలేక అడిగాడు.

"అదిసరేగాని ఒరేయ్ ఉదయం కాస్త కష్టపడేపాటికి అలా కళ్ళు తిరిగి పోయాయేమిటి నాకు? కడుపులో దేవినట్లు, తెలివి తప్పుతున్నట్లూ అనిపించింది. చాలా భయం వేసింది. అక్కడే జ్వరంతో ప్రాణాలు పోతాయేమో ననుకున్నాను. కానీ మళ్ళీ అన్నం తినగానే అంతా తగ్గిపోయింది ఆశ్చర్యంగా."

కృష్ణ ఇంటి కప్పు లేచిపోయేలా నవ్వాడు. నవ్వి నవ్వి గొంతు పొలమారింది. కిషోర్ తెల్లబోయాడు. నవ్వు తెరల మధ్య కృష్ణ అన్నాడు :

"అయ్యా! లక్షాధికారి కుమారుడు గారూ! అది జ్వరమూ కాదు, మరేదీకాదు. అది పేదవాడికి మాటిమాటికి వచ్చేజబ్బు. దాన్నే 'ఆకలి' అంటారు."

"ఆ(!?"

కిషోర్‌బాబు ఆశ్చర్యంతో నోరు వెళ్ళబెట్టాడు. 'ఆకలి' ఇంత తీవ్రంగా ఉంటుందా? ★

గాథావళి :

# ఒక్క వాక్యంతో ఉపన్యాసం

**1962లో** బుద్ధ జయంతి పార్కులో వన మహోత్సవాన్ని ఆరంభించి ప్రసంగించవలసిందిగా ఆ కమిటీవారు డాక్టర్ జాకిర్ హుస్సేన్‌గారిని కోరారు. అప్పటికి ఆయన ఉపరాష్ట్రపతి. సభలో ఉపన్యాసాలు ఇవ్వడం అంటే జాకిర్ హుస్సేన్ గారికి నచ్చేదికాదు. అందువల్ల ఆయన కమిటీవారి ఆహ్వానాన్ని ఒక షరతుమీద అంగీకరించారు. అదేమిటంటే—సభలో కమిటీవారు తనని ప్రసంగించమని అడగకూడదు. అందుకు కమిటీవారు సమ్మతించారు. తీరా ప్రారంభోత్సవం జరిగిపోయాక కమిటీవారు వనమహోత్సవాన్ని గురించి నాలుగు మాటలు చెప్పమని జాకిర్ హుస్సేన్‌గారిని కోరారు. అందరిలోనూ కాదనడం భావ్యంగా వుండదని ఆయన లేచి "చెట్టువల్ల ఉపయోగం ఏమిటంటే, అది తన చెంతకొచ్చే వారికి ఆశ్రయ మిస్తుందేగాని ఉపన్యాసం యివ్వదు" అని ఒక్క వాక్యంతో జాకిర్ హుస్సేన్‌గారు తమ ప్రసంగాన్ని ముగించారు.



—ఈదుపల్లి వెంకటేశ్వరరావు

పూర్తి హాస్యభరిత చిత్రం!

